వాయుగండం!

- వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
- ద్రోణి ప్రభావంతో కొనసాగుతున్న వర్షాలు
- చాలా చోట్ల ముంపునకు గురైన పొలాలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



ఉయ్యూరు మండలంలో వరి నాట్లు వేసిన పొలాల్లో నిలిచిన వర్షపునీరు

కంకిపాడు: జిల్లాకు వాయుగుండం పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 57.59 మి.మీ., కృష్ణాలో 26.2 మి.మీ.సగటు వర్షపాతం నమోదైంది. వర్షాలతో పంటపొలాలు ముంపుబారిన పడ్డాయి. తెలంగాణలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. వాగులు, ఉప నదులు వరదనీటితో పొంగి పొర్లుతున్నాయి. ప్రకాశం బ్యారేజీకి వరదనీరు చేరింది. రోడ్లపై నీరు ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పొంగుతున్న వాగులు, ఉపనదులు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాలైన తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతోంది. ఎన్టీఆర్ జిల్లా మీదుగా ప్రవహిస్తున్న వైరా, కట్టలేరు, మునేరు వరదనీటితో పొంగి పొర్లుతున్నాయి. నందిగామ మండలం దాములూరు వద్ద కాజ్‌వే మీదుగా వరదనీరు ప్రవహిస్తోంది. వీరులపాడు మండలం పల్లంపల్లి వద్ద వైరా, కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్ల మీదుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో దాములూరు-పల్లంపల్లి గ్రామాలకు రాకపోకలను నిలుపు చేశారు. జి.కొండూరు పరిధిలో బుడమేరు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. హెచ్.ముత్యాలంపాడు-కందులపాడు వంతెన వద్ద వరద ఉధృతి అధికంగా ఉండటంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలను నిలుపు చేశారు. జి-కొండూరు నుంచి వెల్లటూరు, విజయవాడ ప్రాంతాలకు సైతం రాకపోకలు స్తంభించాయి. దీంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కుంటముక్కల మీదుగా గమ్యస్థానాలను చేరుకుంటున్నారు.

ప్రకాశం బ్యారేజీకి వరదనీరు

భారీ వర్షాలతో ప్రకాశం బ్యారేజీకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. మంగళవారం మధ్యాహ్నానికి ఎగువ నుంచి వచ్చిన వరదనీటితో బ్యారేజీ నీటిమట్టం 12 అడుగులుగా ఉంది. పైనుంచి వస్తున్న 11,840 క్యూసెక్కుల నీటిని నేరుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. 16 గేట్లను అడుగు మేర ఎత్తి వరదనీటిని ఇరిగేషన్ శాఖ అధికారులు దిగువకు వదులుతున్నారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

ద్రోణి ప్రభావంతో వర్షాలు కొనసాగుతుండటం, వాయుగుండంగా మారి, వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు చెబుతున్నాయి. దీంతో ఇప్పటికే పొలాల్లో చేరిన నీటి కారణంగా వరి నాట్లు పూర్తయిన పొలాల్లో నాట్లు కుళ్లి పోయే ప్రమాదం ఉందని, పసుపు దుంప కుళ్లుతుందని, మిర్చి నారు దెబ్బతినే ప్రమాదం ఉందని, పత్తి విత్తనం పాడవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాలో 26.2 మి.మీ. సగటు వర్షపాతం

కంకిపాడు: అల్పపీడన ప్రభావంతో మంగళవారం ఉదయానికి కృష్ణా జిల్లాలో 26.2 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గన్నవరంలో 52.6 మి.మీ., అత్యల్పంగా నాగాయలంకలో 11.8మి.మీ. నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు...బంటుమిల్లి 49.2, ఉంగుటూరు 44.2, నందివాడ 38.6, గుడివాడ 34.8, గూడూరు 32.0, పెదపారుపూడి 31.2, పెనమలూరు 30.6, బాపులపాడు 28.8, పెడన 27.2, గుడ్లవల్లేరు, పామర్రు 26.8, మచిలీపట్నం 26.2, కంకిపాడు 26.0, మొవ్వ 23.4, కృత్తివెన్ను 18.2, పమిడిముక్కల 17.8, తోట్లవల్లూరు 17.6, చల్లపల్లి 17.0, ఘంటసాల 15.8, కోడూరు 15.4, మోపిదేవి 15.0, అవనిగడ్డ 14.2, ఉయ్యూరు 13.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

రోడ్లు జలమయం.. పొలాల్లోకి నీళ్లు

ఉమ్మడి జిల్లాలో రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాల్లో వర్షంనీరు చేరింది. ఖరీఫ్ పనులు వర్షాలకు ఊపందుకున్నాయి. నాట్లు వేసిన పొలాల్లో నీరు చేరడంతో ముంపునకు గురయ్యాయి. కంకిపాడు మండలం కోలవెన్ను, గుడివాడ, పెడన మండలాల్లో చెన్నూరు, కమలాపురం, కాకర్లమూడి, బల్లిపర్రు, నందమూరు గ్రామాల్లో పంట పొలాలు ముంపులో ఉన్నాయి. నిలిచిన నీటిని బోదెల్లోకి మళ్లించి పంటలను సంరక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. విజయవాడలోని రోడ్లు జలమయమయ్యాయి. కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో కుండపోత వాన కురిసింది. ప్రధాన రహదారి వర్షపునీటితో నిండిపోయింది. పలు కాలనీల్లోని అంతర్గత రహదారులు నీటితో నిండిపోయాయి. దీంతో వాహనచోదకులు అగచాట్లు పడ్డారు. ఒక్క మచిలీపట్నంలోనే 2500 హెక్టార్లలో వరి నాట్లు పూర్తయిన పొలాలు, 250 హెక్టార్లలో వేరుశెనగ పొలాలు ముంపులో ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.



జలమయంగా పామర్రు-కొండిపర్రు రహదారి



బంటుమిల్లి-నాగేశ్వరరావుపేట గ్రామాల మధ్య చెరువులా దర్శనమిస్తున్న పంట పొలాలు

క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. సప్తగిరి బ్యాంకు సిబ్బంది లెక్కింపులో పాల్గొంటారన్నారు. భక్తులు హుండీ కానుకల లెక్కింపులో పాల్గొనాలంటే ఆధార్ కార్డుతో వచ్చి సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహంగా రెడ్ కలర్ డే



ఉయ్యూరు: రెడ్ కలర్ డేను చిన్నారులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఎంకే గ్రూప్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉయ్యూరు పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం రెడ్ కలర్ డే నిర్వహించారు. చిన్నారులు ఎరుపు రంగు దుస్తులు, వివిధ రకాల ఎరుపు రంగు వస్తువులతో చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు ఎరుపు రంగు ఆవశ్యకతను వివరించారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

కంకిపాడు: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ సూచించారు. మండలంలోని పునాదిపాడు, ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాలల్లో పీఎస్, బీఎస్ సబ్జెక్ట్ కాంప్లెక్స్‌లను మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ ఫిజిక్స్, బయాలజీ బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేలా బోధన సాగించాలని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కంకిపాడు, పెనమలూరు మండలాలకు చెందిన ఫిజిక్స్, బయాలజీ ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వేను వేగవంతం చేయాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలని రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం లో వీఆర్వోల సమావేశం జరిగింది. టార్గెట్ ప్రకారం రోజుకు వంద మంది ఓటర్లను కలిసి సర్వే నిర్వహించాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు తప్పనిసరిగా చేయాలని, చనిపోయిన వారి పేర్లు తొలగించడంతో పాటు అడ్రసు మార్పులకనుగుణంగా చర్యలు ఉండాలన్నారు. మండలంలో 9 గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలన్నారు. ఇంకా నాలా ఫైల్స్ పెండింగ్‌లో ఉన్న వీఆర్వోలు వెంటనే పూర్తి చేయాలని, జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి అందజేయాలని తహసీల్దార్ జాహ్నవిరెడ్డి ఆదేశించారు.గొల్లపూడి గ్రామంలో వరద ప్రభావానికి గురయ్యే ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డెప్యూటీ తహసీల్దార్ ఎండీ సలీమ్, మండల సర్వేయర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత అరిగెల రవికి ఘన నివాళి



హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు, ఆర్టీసీ ఉద్యోగి అరిగెల రవి అకాల మృతి దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులో కార్మిక నేత అరిగెల రవి ప్రథమ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అరిగెల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ తదితరులు ఆయనకు నివాళి అర్పించారు.

గుర్రపు డెక్క తొలగించండి

ఉంగుటూరు: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముక్కపాడు వంతెన వద్ద వన్నేరు కాలువలో గుర్రపుడెక్క మేటలుగా నిలిచిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి వర్షం నీరు పంట పొలాల్లో నిలిచాయి. కాలువలోని గుర్రపుడెక్క తొలగించకపోతే నీరు బయటకు వెళ్లే మార్గంలేక వరి నాట్లు కుళ్లిపోయి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి నీటిప్రవాహం సక్రమంగా ముందుకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచ్ కొలుసు శిరీషా ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. అధిక వర్షాలు కురుస్తున్న పరిస్థితులలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. కచ్చా డ్రెయిన్‌లు తవ్వించారు. డ్రెయినేజీలో పూడికలు తీయించి మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకున్నారు.

అత్తింటి వేధింపులపై కేసుల నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్త, భర్తలపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నైజాంగేటు ప్రాంతానికి చెందిన షేక్.మదీనాకు 2016లో వివాహం కాగా భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుంది. 2021లో మదీనా పంజాసెంటర్‌కు చెందిన అబ్దుల్ సత్తార్‌కు ఇచ్చి పెద్దలు రెండో వివాహం జరిపించారు. గత కొంతకాలంగా సత్తార్ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. భర్త వేధింపులపై అత్తకు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. భర్త, అత్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధింపులు

ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ టేనర్‌పేట ప్రాంతానికి చెందిన మాతంగి మోనిక 2020లో వసంతకుమార్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. గత కొంతకాలంగా వసంతకుమార్ మద్యానికి బానిసై భార్య, కుమార్తెను పట్టించుకోవడం లేదు. ఇదేమిటని అడిగితే పుట్టింటికి వెళ్లి రూ.50 వేలు తీసుకొని రావాలని వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జగనన్న సురక్షతో అనేక సమస్యలు పరిష్కారం



తాడిగడపలో సర్టిఫికెట్లు జారీ చేసిన కమిషనర్ ప్రకాశరావు



మానికొండలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ కుసుమ, అధికారులు

కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు అనేకం పరిష్కారం చేశామని తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. ఆయన మంగళవారం తాడిగడప 3, యనమలకుదురు 5 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తరువాత అనేక సమస్యలు గుర్తించి పరిష్కారం చేశామన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారని అన్నారు. గుర్తించిన సమస్యలు వారం రోజుల్లోనే పరిష్కారం చేశామని తెలిపారు. ప్రజలు వారి సమస్యలు సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తాడిగడపలో 1338 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మేడసాని రామాంజనేయులు, కె.క్రిస్టోఫర్, జిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌బాషా, పి.సాంబయ్య, వెలిశిల ప్రసాద్, ముజీబ్, జాకీర్, లక్ష్మి, పి.కిషోర్, యల్లారావు, ఎం.కిషోర్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సంక్షేమం

ఉంగుటూరు: అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని వైస్ ఎంపీపీ పీరంకి కుసుమ అన్నారు. మానికొండ-2 గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పలువురికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కుల ధ్రువీకరణ 151, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 150 అందజేశారు. సర్పంచ్ ఎస్.స్వర్ణలత, ఎంపీటీసీ ముత్తయ్య, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో శేషగిరిరావు, కార్యదర్శి జి.రత్నకిశోర్, సచివాలయ గ్రామ కన్వీనర్ తోట శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం

కంకిపాడు: ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. ఏపీ పీజీ సెట్-2023లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించిన జంపాన జ్ఞాన చరిష్మాకు కంకిపాడు పట్టణంలో సోమవారం రాత్రి అభినందన సభ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ కష్టపడి చదివితే విజయం సాధ్యమవుతుందన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. యూవైడబ్ల్యూఓ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ప్రతిభా కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీల సురేష్, రాష్ట్ర కార్యదర్శి జె.మధుబాబు, కంకిపాడు మండల అధ్యక్షుడు ఆలపాటి శ్రీకాంత్, కార్యదర్శి టి.శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థిని జ్ఞాన చరిష్మాను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, ఇతరులు

కోతకు గురైన రహదారి

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం-కొత్తగూడెం గ్రామాల మధ్య పోలవరం కాలువ వంతెన సమీపంలో రహదారికి గండి ఏర్పడటంతో మంగళవారం ఆ ప్రదేశాన్ని హుటాహుటిన అధికారుల బృందం సందర్శించింది. గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పోలవరం కాలువ వైపు నుంచి రహదారి కోతకు గురి అవుతూ వస్తుండటంతో ఇప్పటికే రహదారి సగానికి పైగా కూలిపోయింది. దీంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. భయాందోళనకు గురి అవుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రదేశంలో గతంలో కొత్తగూడెం, వీరపనేనిగూడెం గ్రామాలకు చెందిన పంట చేలపై నడిచే అదనపు నీరు నేరుగా పోలవరం కాలువలోనికి వచ్చేందుకు తూములు ఏర్పాటు చేశారు. అయితే ఆ తూములపై పోసిన పోత మట్టి జారిపోతుండటంతో ఈ గొయ్యి ఏర్పడినట్లు అధికారులు చెప్పారు. ఈ ప్రదేశంలో నేరుగా పంట చేల నీరు పోలవరంలో కలిసేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ విజ్ఞప్తి చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రహదారి పూర్తిగా తెగిపోయి ఇబ్బందులు పడతామని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త దేవిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కలెక్టర్‌కు, ఇరిగేషన్, పంచాయితీ రాజ్, పోలీసు, రెవిన్యూ, పోలవరం, ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదాన్ని సూచిస్తూ గ్రామస్తులు రహదారి మార్గం వద్ద ముళ్లకంపలు ఏర్పాటు చేశారు. పోలవరం, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ ఏఈలు విజయలక్ష్మీ, దాసు, దుర్గారావు గ్రామస్తులతో కలసి ప్రదేశాన్ని సందర్శించి చర్చించారు.



కోతకు గురైన రహదారి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ జేజమ్మ, అధికారులు, గ్రామస్తులు

వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోని ప్రజానీకానికి వైఎస్ జగన్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. అమరావతి ప్రాంతంలో 50 వేల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వించిపేటలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలో ఎక్కడా ఏ ముఖ్యమంత్రి ఒకేసారి 50 వేల ఇళ్లకు శంకుస్థాపన చేసిన సంఘటన ఎక్కడా లేదన్నారు. అది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే జరిగిందన్నారు. మూడు రాజధానుల్లో ఒకటైన అమరావతిలో ఏ పేదవాడు ఉండకూడదు, ఏ అట్టడుగు వర్గాలకు అక్కడ స్థానం లేదని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన వర్గం అనేక కేసులు వేసి అడ్డుకున్నా జగన్ పేదల పక్షపాతిగా వేలాది మందికి అమరావతిలో ఇళ్లను కేటాయించి నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. 50 వేల మందిలో ముస్లిం మైనార్టీలకు సైతం అవకాశం కల్పించటం ఆనందంగా ఉందన్నారు. ప్రజల గుండెల్లో వైఎస్ జగన్ చిరస్థాయిగా నిలిచిపోతారని చెప్పారు. రానున్న కాలంలో వైఎస్ జగన్ నాయకత్వంలో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఆత్కూరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. హనుమాన్ జంక్షన్ సీఐ నవీన నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ మంగళవారం ఆత్కూరు పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే ప్రదేశాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలా వేగాన్ని నియంత్రించేందుకు బ్లింకర్స్, వైట్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారి సిబ్బందికి సూచించారు. అలాగే పిన్నమనేని ఆస్పత్రి వద్ద రోడ్డు దాటే వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలపకుండా రోడ్డు భద్రత సిబ్బంది పెట్రోలింగ్ తప్పనిసరిగా చేయించాలని హైవే ఇంచార్జ్ ఎస్ఐ సుందర్‌రావును సూచించారు.

నీట మునిగిన వరి పొలాలు



కడవకొల్లు శివారు వీరవల్లిలో నీటమునిగిన వరి పొలాలు



ఉయ్యూరు సెంటరులో కురుస్తున్న వర్షం

ఉయ్యూరు: వదలకుండా కురుస్తున్న వానతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమై రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. జాతీయ రహదారి వెంబడి సర్వీసు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. అల్పపీడన ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచిపోయింది. నాట్లు వేసిన పొలాలు నీట ముంపునకు గురయ్యాయి. మండలంలోని కడవకొల్లు శివారు వీరవల్లిలో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. ముదునూరు, కాటూరు, కలవపాముల, బోళ్లపాడు తదితర గ్రామాల్లోని పల్లపు పొలాలు నీట మునిగాయి. రైతులు పంట పొలాల్లో నీటిని మళ్లించేందుకు శ్రమిస్తున్నారు.

అంతర్గత రహదారులు జలమయం

రామవరప్పాడు : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, రహదారులపైకి మురుగునీరు చేరుకుంది. రామవరప్పాడు బల్లెంవారి వీధి, హైస్కూల్ రోడ్డు చివరి వైపు, జాతీయరహదారిపై బారీగా వర్షపునీరు చేరుకుంది. ప్రసాదంపాడు వాటర్ ట్యాంక్ రోడ్డు, కానూరు వెళ్లు డొంక రోడ్డు, కాల్వగట్టు ప్రాంతం, ఎనికేపాడులో శివాలయం పల్లాలు, జాతీయరహదారి నీట మునిగాయి. నిడమానూరులో రామానగర్, కాల్వగట్టు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. పలు గ్రామాల్లో డ్రెయిన్లు పొంగి వర్షపు నీటికి మురుగునీరు తోడై రోడ్లపైకి చేరుకున్నాయి. దీంతో ఆయా పంచాయతీ కార్యదర్శులు నిలిచిన వర్షపునీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



దావాజిగూడెంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

నీటమునిగిన రోడ్లు

దావాజిగూడెం(గన్నవరం): గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గన్నవరం పరిసరాల్లోని లోతట్టులోని రహదారులు ముంపునకు గురయ్యాయి. దావాజిగూడెంలోని రమణమ్మ చెరువు కాలనీకి వెళ్లే ఎస్‌టీబీఎఫ్ కళాశాల రోడ్డుపై వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడటం కారణంగా ఈ పరిస్థితి నెలకొందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన గ్రామపంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయడంతో పాటు వర్షం నీరు బయటకు వెళ్లే విధంగా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎడతెరపి లేని వర్షం

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో గ్రామాలు జలమయం అయ్యాయి. రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం జోరుగా కురుస్తూనే ఉండటంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వాహనమిత్ర పథకానికి దరఖాస్తులు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వాహనమిత్ర పథకం కింద ఆర్థిక సహాయం పొందగోరు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ బుక్ ఉన్న ఆటో, టాటాఏస్, ఎండీయూ వాహనాల యజమానులు పథకానికి అర్హులన్నారు. ఎంపికైన వారికి ప్రభుత్వం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. గత ఏడాది మండలంలో 481 మంది ఈ పథకంలో లబ్ధిపొందారని చెప్పారు.

బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మణిపూర్ అల్లర్లు



నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

గన్నవరం: బీజేపీ ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయని సీపీఐ నేతలు విమర్శించారు. మణిపూర్ సంఘటనలపై స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం ఆ పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా పార్టీ ఏరియా కార్యదర్శి పెద్ది వాసుదేవరావు మాట్లాడుతూ రెండు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని చెప్పారు. ఫలితంగా యువతులపై ఆత్యాచార ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మతం పేరుతో అల్లర్లు సృష్టిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తెలిపారు. పార్టీ నేతలు కేఆర్ఎం జోషి, కట్టవరపు విజయరావు, పడమట నరేష్, వెంగళ్ల శివయ్య, నూతక్కి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.